క్లుప్తంగా

నేడు పెద్దమందడికి కలెక్టర్ రాక

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు కలెక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామానికి చెందిన కురుమయ్య మట్టిమిద్దె కూలింది. పక్కగదిలో నిద్రిస్తున్న వారికి ఒక్కసారిగా శబ్దం రావడంతో ఇంటి బయటకు పరుగు తీశారు. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, వస్తువులు మట్టిలో కూరుకుపోయాయి. నివాసం ఉండేందుకు చాలా ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

కౌన్సిలర్‌కు సన్మానం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 13వ వార్డు రాంనగర్ కాలనీలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో కౌన్సిలర్ పుట్టపాకల మహేష్ నూతనంగా ప్రధాన సీసీ రోడ్డును నిర్మించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కాలనీలో కౌన్సిలర్ మహేష్‌ను స్థానికులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజలకు ఏ ఇబ్బందులు కలగకుండా, వార్డులో సాధ్యమైనంత వరకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

వాల్‌పోస్టర్ల విడుదల



మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 55 ఏళ్ల వయసు పైబడిన హమాలీలకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి నరేందర్, ఆంజనేయులు, వెంకటస్వామి, వెంకటన్న, సవరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల బాగు కోసమే పోరాడుతాం

వనపర్తి టౌన్: ప్రజలు బాగుంటేనే వ్యవస్థ బాగుంటుందని, ప్రజల బాగుకోసం లాభం ఆశించకుండా ప్రజా సమస్యలకై పోరాడేవారు నిజమైన నాయకులని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని గీత పారిశ్రామిక సహకార సంఘం భవనంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ మేరకు ఆయన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సురేష్‌గౌడ్, పార్థసారథి గౌడ్, కృపానందంగౌడ్, కౌన్సిలర్ బ్రహ్మంచారి, మధుగౌడ్, గాయకుడు మనిగిల్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం



చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో సర్పంచ్ నంది కౌసల్య, ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, బీఆర్ఎస్ మండల నాయకుడు చిన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డేగ శేఖర్, తలారి వెంకటేష్, బ్రహ్మం, కృష్ణ, స్వాములయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

కొత్తకోట రూరల్: రైతులు కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని పెద్దమందడి పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రత్యేక రాష్ట్రంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా సీఎం కేసీఆర్ ఎక్కడ అవసరం ఉన్నా అక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని కొనియాడారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా రైతుల ధాన్యం తడిసిపోయిందని, మంత్రి నిరంజన్‌రెడ్డి సూచన మేరకు రైతులు అధైర్యపడవద్దని ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, సర్పంచ్ అనంతమ్మ, ఉప సర్పంచ్ లత, ఎంపీటీసీ కుర్మన్న, బుచ్చన్న, భీచుపల్లి, వెంకట్‌రెడ్డి, రాజు, విష్ణు, వెంకటేష్, రైతులు, తదితరులు ఉన్నారు.



జగత్‌పల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

వరిధాన్యం కుప్పల పరిశీలన

అకాల వర్షాలతో తడిసిన వరిధాన్యం కుప్పలను బుధవారం పెద్దమందడి తహసీల్దార్ సంధ్య పరిశీలించారు. మంగళవారం రాత్రి మండలంలో 15.2 వర్షపాతం నమోదయిందని తెలిపారు. ధాన్యం తడిసిన రైతులు ధైర్యంగా ఉండాలని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని సూచించారు.

పాన్‌గల్: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరను చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వెంగళాయిపల్లి ఎంపీటీసీ రవికుమార్, సర్పంచ్ అశోక్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని వెంగళాయిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యంను కాంటా చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ నాగరాజు, మహిళ సమాఖ్య సభ్యులు ఉన్నారు.

అమరచింత: అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని వరికొనుగోలు కేంద్రాలను బుధవారం ఇరు మండలాల తహసీల్దార్లు సింధూజ, చాంద్‌పాషా సందర్శించారు. మంగళవారం మధ్య రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులను ఇబ్బందులు తెలుసుకోవాలనే కలెక్టర్ ఆదేశాలతో కొనుగోలు కేంద్రాలను వారు సందర్శించారు. ఇరు మండలాల్లో 17.8 ఎంఎం వర్షపాతం నమోదయ్యిందని, ఎక్కడ వరికుప్పలు తడవలేదని తహసీల్దార్లు వెల్లడించారు.

మదనాపురం: మండలంలోని కొత్తపల్లి, దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం నరేందర్ పరిశీలించారు. మంగళవారం అర్ధరాత్రి వర్షం కారణంగా రైతుల వరి ధాన్యం తడిసిందా అనే విషయాలను ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంతో పాటు శ్రీరంగాపురం, జానంపేట, వెంకటాపురం గ్రామాల్లో బుధవారం సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ గాయత్రి, సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటస్వామి, సర్పంచ్ నాగన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈఓ శివకుమార్, ఏఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వెంగళాయిపల్లిలో..



పెద్దమందడిలో..



దంతనూరులో..



శ్రీరంగాపురంలో..

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు



అమరచింత: సకాలంలో వరికోతలు ప్రారంభమైనా ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతోనే అకాల వర్షాలకు వరిధాన్యం తడిసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని జూరాల, గుంటిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన వరిధాన్యాన్ని తక్షణమే రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాల వారిగా పర్యటించి కల్లాల వద్దే వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, తులసీరాజ్, రహ్మతుల్లా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలో అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం షరతులు లేకుండా కొనుగోలు చేయాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ వహీద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అన్నారంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంటను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రవీణ్, వెంకటయ్య, గోపాల్‌నాయుడు, సత్యం, రైతులు పాల్గొన్నారు.

ఉదయం సమ్మె.. మధ్యాహ్నం విరమణ



సమ్మె చేస్తున్న ఆర్టిజన్‌లు

వనపర్తి టౌన్: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విద్యుత్ ఆర్టిజన్‌లు చేపట్టిన సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. ఆర్టిజన్‌లకు సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మద్దతు తెలిపారు. ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించాలని, ఈ మేరకు ప్రభుత్వం చొరువ చూపాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగానే ఆర్టిజన్‌లు సమ్మె చేపడుతున్నారని చెప్పారు. ఉదయం సమ్మె జరగగా మధ్యాహ్నం ఉన్నతాధికారుల ఆదేశాలో లేకా ఆర్టిజన్‌ల సంఘం పెద్దల పిలుపో తెలియదు కానీ వారు సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టిజన్‌ల సమ్మె విరమణతో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ఇక అవకాశం ఉండదని ప్రకటించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, చందుయాదవ్, బండారు నరేందర్, నాగరాజు, శరత్‌కుమార్, మల్లికార్జున్, రాజుగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటిశ్రీధర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 30వ వార్డులో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లా కేంద్రంలోని 30 వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమంలో 37,272మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 3,649మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 4,699 మంది ప్రిస్క్రిప్షన్ అద్దాలు, 799మందికి కంటి సర్జరీ కోసం సిఫార్స్ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు హర్షిత, ఖాదర్, రాము, నిర్మల, రాజ్యలక్ష్మి, కాలనీవాసులు రఘునాథ్‌రెడ్డి, కురుమన్న, మదిలేటి, పాపిరెడ్డి తదితరులు ఉన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న వాకిటిశ్రీధర్

పదోరోజుకు చేరిన వీఓఏల సమ్మె

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధన కోసం గ్రామ సహాయకులు (వీఓఏ) చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 10వ రోజుకు చేరింది. పదో రోజు దీక్షకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్ రావు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ వీఓఏలు చేపట్టిన దీక్ష పది రోజులు కావస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్ల సాధనకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్తకోట రూరల్: ఐకేపీ వీఓఏ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి మన్యం అన్నారు. పెద్దమందడి మండల కేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మద్దదతు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంటన్నయాదవ్, ఎన్ఎస్‌యూఐ కో ఆర్డినేటర్ త్రినాథ్, రాఘవేందర్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వీఓఏల మండల అధ్యక్షురాలు మోతిబాయి తదితరులు ఉన్నారు.



పెద్దమందడిలో మాట్లాడుతున్న పెంటన్నయాదవ్

రోడ్లు ఊడుస్తూ..

మదనాపురం: మండల కేంద్రంలో బుధవారం ఐకేపీ వీఓఏలు తమ సమస్యలపై స్పందించని ప్రభుత్వ తీరును ఎండగడుతూ రోడ్లు ఊడ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వం వీఓఏలపై మొండిగా వ్యవహరించడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ కోరారు. కార్యక్రమంలో నారాయణ, జమ్మన్న, మునికుమార్, అలివేల, స్వప్న, క్రాంతి, రాజేశ్వరి, శ్రీమణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల శ్రమను దోపిడీ చేయొద్దు

కొత్తకోట రూరల్: ఉపాధి కూలీల శ్రమను కేంద్ర ప్రభుత్వం దోపిడి చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు ఆరోపించారు. బుధవారం పెద్దమందడి మండలంలోని మనిగిల్ల, పెద్దమందడి శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు నీడనిచ్చే టెంట్లు వేయడం లేదని, కనీసం తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు కూలీ రూ.60 నుంచి రూ.120 మాత్రమే ఇస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు కూలి డబ్బులను పెంచాలని డిమాండ్ చేశారు. పనిచేసిన కూలీలకు 15రోజుల్లో డబ్బులు చెల్లించాలని నిబంధనలు ఉన్నప్పటికీ 50రోజులు కావస్తున్నా కూలీ డబ్బులు చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు.

కూలి డబ్బులు పెంచాలి

గడిచిన మూడేళ్లలో వంట గ్యాస్ సిలిండర్ ధర, నిత్యావసర వస్తువుల ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు మాత్రం కూలీ పెంచడం లేదన్నారు. వ్యవసాయ యంత్రాలు రావడంతో వ్యవసాయ కూలీలకు పని దొరకడం లేదని, 100రోజుల పనిదినాలను 200రోజులకు పెంచాలని, అదేవిధంగా పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిన్నరాయుడు, సత్యం, నారాయణ, రాణి, మన్యం, భాగ్యమ్మ, శ్యామలమ్మ, ఎల్లమ్మ, కవిత, చంద్రమ్మ, కమలమ్మ, బాలమ్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

- అధికారుల తీరుపై జెడ్పీచైర్మన్ ఆగ్రహం
- ఇరిగేషన్, మిషన్ భగీరథ పనుల్లో నిర్లక్ష్య వైఖరిపై అసహనం
- ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

చిన్నంబావి: సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను జెడ్పీచైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అధికారులలో ఏమాత్రం మార్పు రావడం లేదన్నారు. ప్రతిసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే సమస్యలను లేవనెత్తకుండా కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మిషన్ భగీరథ అధికారులు చిన్నంబావి మండలంలో కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పనులు పూర్తి చేయలేదని, సమస్యపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సహించేది లేదని హెచ్చరించారు.

కల్వర్టుల నిర్మాణంలో అలసత్వం

గత రెండు సమావేశాల్లో రైతుల కోసం కాలువలపై కొత్తగా కల్వర్టులు నిర్మించాలని సభ్యులు కోరుతున్నా అధికారులు పట్టించుకోకుండా సిబ్బంది లేరని వంక చూపుతున్నారని ఇరిగేషన్ అధికారులపై తీవ్రంగా ఎంపీపీ సోమేశ్వరమ్మ మండిపడ్డారు. చిన్నమారు లిఫ్టులో సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమస్యపై ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని, ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. మండలంలో కొందరు అధికారులు పని చేయకుండా రాజకీయాలు చేస్తున్నారని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని, వారు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు వారధిగా ఉండాలని కోరారు. అదేవిధంగా మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మద్దిలేటి, సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, సర్పంచ్‌లు రామస్వామి, సురేందర్‌సింగ్, చక్రవర్తి, శివమ్మ, నంది కౌసల్య, ఎంపీటీసీలు వడ్ల రాజు, మౌలాలి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అమరచింత: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూర్ ఇన్‌చార్జ్ ఎస్సై మహ్మద్‌అమ్జాద్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో బుధవారం ఎస్పీ ఆదేశానుసారం ప్రజలకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, అపరిచితులు ఎవరైనా ఫోన్‌చేసి ఆధార్, బ్యాంక్ అకౌంట్ వివరాలు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, డ్రైవింగ్ లైసెన్స్, పత్రాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించి తమ ప్రాణాలను కాపాడుకుంటూ తమ కుటుంబానికి భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి రాజు, ఎంపీటీసీ శ్యామల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



హక్కు పత్రాలు ఇవ్వాలంటూ ఆందోళన



అమరచింత మున్సిపాలిటీ ఎదుట ఆందోళన చేస్తున్న గుడిసెల పోరు లబ్ధిదారులు

అమరచింత: ఎనిమిది నెలలుగా దుపాయికుంటలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న తమకు హక్కు పత్రాలు సైతం ఎందుకు ఇవ్వడం లేదంటూ గుడిసెల పోరు లబ్ధిదారులు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ ఎదుట ఆందోళన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి మాట్లాడుతూ 1997లో పట్టణ శివారులోని దుంపాయికుంటలో నిరుపేదలకు ఇంటి నిర్మాణాల కోసం అప్పట్లో పట్టాలను ఇచ్చారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు స్థలాలు మాత్రం చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పేదలకు ఇచ్చిన ఇంటిస్థలాల్లో ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడానికి ముందుకు రావడంతో లబ్ధిదారులు తమకు గతంలో కేటాయించిన స్థలంలో గుడిసెలు వేసుకొని ఎనిమిది నెలలుగా ఆందోళన చేస్తూ అక్కడే జీవిస్తున్న అధికారులు పట్టించుకోవట్లేదని వాపోయారు. గుడిసెలు నిర్మించుకున్న వారికి స్థలం హద్దులు చూపడంతో పాటు మున్సిపాలిటీ ద్వారా కుళాయి కనెక్షన్, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఇంటి స్థలాల కోసం ఆందోళన చేస్తున్న వారిపై ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు చిన్నచూపు చూడటం తగదన్నారు. అర్హులైన వారందరికీ వెంటనే హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు మున్సిపాలిటీ వద్ద ధర్నా విరమించలేమన్నారు. దీంతో కమిషనర్ జోక్యం చేసుకొని కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అజయ్, ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

చీటికి మాటికి మున్సిపాలిటీకి వచ్చి ఆందోళన పేరిట మున్సిపల్ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కమిషనర్ మహమ్మద్ ఖాజా హెచ్చరించారు. దుంపాయికుంటలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలు ఎప్పుడో ప్రభుత్వం రద్దు చేసిందని, వాటి గురించి తెలిసి ఆందోళన పేరిట తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

కూలి చెల్లించాలంటూ ధర్నా



ఆత్మకూర్‌లో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు పెండింగ్ ఉన్న కూలి డబ్బులు చెల్లించాలంటూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలి డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మూడు నెలల కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనిపై కూలీలు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధిహామీ పథకానికి నిధులు మంజూరు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించి కూలీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏపీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రంగమ్మ, లక్ష్మమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.